400 లక్షల కోట్ల దిగువకు..

క్షీణించిన బీఎస్ఈ సంస్థల విలువ

ముంబై, ఫిబ్రవరి 18: బీఎస్ఈలో లిస్టైన సంస్థల విలువ రూ.400 లక్షల కోట్ల దిగువకు పడిపోయింది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులు తరలించుకుపోతుండటం, కార్పొరేట్ల నిరుత్సాహక ఫలితాలతో మదుపరుల్లో సెంటిమెంట్ నీరుగారింది. దీంతో అమ్మకాలకు మొగ్గుచూపడంతో మంగళవారం రూ.2,01,032.5 కోట్లు కరిగిపోయి రూ.3,89,31,067.30 కోట్ల(4.58 ట్రిలియన్ డాలర్లు)కు పడిపోయింది. గతేడాది ఏప్రిల్‌లో తొలిసారిగా రూ.400 లక్షల కోట్ల మార్క్‌ను అధిగమించిన బీఎస్ఈలో లిస్టైన సంస్థల విలువ 10 నెలల్లో ఈ మైలురాయిని కోల్పోవడం విశేషం. గతేడాది సెప్టెంబర్ 27న చారిత్రక గరిష్ఠ స్థాయి 85,978.25 పాయింట్లను తాకిన బీఎస్ఈ సెన్సెక్స్ ప్రస్తుతం 10,010.86 పాయింట్లు లేదా 11.64 శాతం వాటాను కోల్పోయింది.

సూచీలబీ అదేదారి

స్టాక్ మార్కెట్లు మళ్లీ నష్టాల్లోకి జారుకున్నాయి. ఎఫ్ఐఐల పెట్టుబడులు ఉపసంహరణ, కార్పొరేట్ల నిరుత్సాహక ఫలితాలతో మంగళవారం సూచీలు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. ఇంట్రాడేలో 500 పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 29.47 పాయింట్లు నష్టపోయి 75,967.39 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ కూడా 14.20 పాయింట్లు కోల్పోయి 22,945.30 వద్ద స్థిరపడింది. మార్కెట్లో ఇండస్ఇండ్ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌యూఎల్, అల్ట్రాటెక్ సిమెంట్, టీసీఎస్, ఐటీసీ, టాటా మోటర్స్, సన్‌ఫార్మా షేర్లు నష్టపోగా..ఎన్‌టీపీసీ, టెక్ మహీంద్రా, జొమాటో, పవర్‌గ్రిడ్, కొటక్ మహీంద్రా బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు లాభాల్లో ముగిశాయి. రంగాలవారీగా చూస్తే ఇండస్ట్రియల్స్ 1.51 శాతం నష్టపోగా, కన్జ్యూమర్ డ్యూరబుల్ 1.19 శాతం, టెలికం 1.06 శాతం, క్యాపిటల్ గూడ్స్, వాహన రంగ షేర్లు నష్టపోయాయి. కానీ, యుటిలిటీ, ఐటీ, ఆయిల్ అండ్ గ్యాస్, పవర్, ఎనర్జీ సూచీలకు మదుపరుల నుంచి మద్దతు లభించింది.

మంగళవారం న్యూఢిల్లీలో ఎల్ఐసీ స్మార్ట్ పెన్షన్ ప్లాన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్థిక సేవల కార్యదర్శి నాగరాజు తదితరులు

ఎల్ఐసీ స్మార్ట్ పెన్షన్ ప్లాన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: ప్రభుత్వ రంగ జీవిత బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) సంస్థ మంగళవారం ఓ సరికొత్త ప్లాన్‌ను పరిచయం చేసింది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఆర్థిక సేవల కార్యదర్శి ఎం నాగరాజు చేతులమీదుగా దీన్ని ఆవిష్కరించింది. ఇక ఇదో నాన్-లింక్డ్, వ్యక్తిగత/బృంద, పొదుపు, తక్షణ యాన్యుటీ ప్లాన్. సింగిల్ లైఫ్, జాయింట్ లైఫ్ యాన్యుటీ రకాల కోసం విస్తృత శ్రేణిలో యాన్యుటీ ఆప్షన్లను అందిస్తుంది. జీవించి ఉన్న పాలసీదారులకైనా, మరణించిన పాలసీదారుల నామినీలు, వారసులకైనా ప్లాన్ నిబంధనలకు లోబడి ఎంచుకున్నవిధంగా ఒకేసారి లేదా వాయిదా పద్ధతుల్లో చెల్లింపులుంటాయి. ఈ కార్యక్రమంలో ఆర్థిక సేవల విభాగం అదనపు కార్యదర్శి ఎంపీ తంగిరాల, సంయుక్త కార్యదర్శి ప్రశాంత్ కుమార్ గోయల్‌లతోపాటు ఎల్ఐసీ ఎండీ, సీఈవో సిద్ధార్థ మహంతీ ఇతర మేనేజింగ్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

స్మార్ట్ పెన్షన్ ప్లాన్ ప్రత్యేకతలు

- సింగిల్ ప్రీమియం, తక్షణ యాన్యుటీ.
- కస్టమర్ల అవసరాలకు తగ్గట్టుగా విస్తృత రీతిలో యాన్యుటీ ఆప్షన్లు.
- పాలసీదారుడి కనీస వయసు 18 ఏండ్లు. గరిష్ఠ వయసు యాన్యుటీ ఆప్షన్‌నుబట్టి 65 నుంచి 100 ఏండ్లు.
- సింగిల్ లైఫ్, జాయింట్ లైఫ్ యాన్యుటీ ఆప్షన్లను ఎంచుకునే వెసులుబాటు.
- ప్రస్తుత పాలసీదారులకు, చనిపోయిన పాలసీదారుల నామినీ లేదా వారసులకు యాన్యుటీ రేటు పెంపు ద్వారా ఆకర్షణీయ ప్రోత్సాహకాలు.
- పాలసీ నిబంధనలకు లోబడి పాక్షికంగానైనా లేదా పూర్తిస్థాయిలో నగదు ఉపసంహరించుకొనే సౌకర్యం.
- కనీస కొనుగోలు ధర లక్ష రూపాయలు. దీన్ని మించి ఎక్కువగా కొంటే ప్రోత్సాహకాలూ లభిస్తాయి.
- వార్షిక, అర్ధ వార్షిక, త్రైమాసిక, నెలవారీ చెల్లింపులకు అవకాశం. వీటికి తగ్గట్టే యాన్యుటీ వాయిదాలుంటాయి.
- ప్రత్యేకంగా ఎన్‌పీఎస్ సబ్‌స్క్రైబర్లకు తక్షణ యాన్యుటీకి వెసులుబాటు.
- దివ్యాంగుల కోసం కూడా ప్రయోజనకర ఆప్షన్లు.
- www.licindia.in ద్వారా ఆన్‌లైన్‌లో ప్లాన్‌ను కొనవచ్చు. ఎల్ఐసీ ఏజెంట్, ఇతర ఆఫ్‌లైన్ మార్గాల ద్వారా కూడా కొనవచ్చు.
- ప్లాన్ కొన్న 3 నెలల తర్వాత ఎప్పుడైనా పాలసీదారులు రుణ సదుపాయం తీసుకునే వీలుంటుంది.

టీవీఎస్ 2025 ఎడిషన్

రోనిన్ బైకు

ప్రారంభ ధర రూ.1.35 లక్షలు

చెన్నై, ఫిబ్రవరి 18: ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ టీవీఎస్ మోటర్..దేశీయ మార్కెట్‌కు మరో వాహనాన్ని పరిచయం చేసింది. 2025 ఎడిషన్‌గా విడుదల చేసిన 225 సీసీ మోటర్‌సైకిల్ 'రోనిన్'లో భద్రత ఫీచర్లను అప్‌గ్రేడ్ చేసింది. రెండు రంగుల్లో లభించనున్న ఈ బైకు ప్రారంభ ధర రూ.1.35 లక్షలుగా నిర్ణయించింది. డ్యూయల్ చానెల్ ఏబీఎస్ రకం మాడల్ రూ.1.59 లక్షలు. ఈ ధరలు చెన్నై షోరూంనకు సంబంధించినవి. 225.9 సీసీ ఇంజిన్‌తో తయారైన ఈ బైకు 20.4 పీఎస్‌ల శక్తి నివ్వనన్నది. టెక్నాలజీ పరంగా భారీ మార్పులు చేసిన సంస్థ..ఈ బైకును యువతకు నచ్చే విధంగా డిజైన్ చేసినట్లు వెల్లడించింది. స్టైలిష్, రైడింగ్ పరంగా కొన్ని మార్పులు చేసినట్టు కంపెనీ పేర్కొన్నది. ఈ మాడల్‌తో సేల్స్ పెరుగు తాయన్న ఆశాభావాన్ని సంస్థ కనబరుస్తున్నది.

ఎన్ఎస్ఈ విలువ రూ.4.7 లక్షల కోట్లు

- **గత ఏడాది 201 శాతం వృద్ధి**

ముంబై, ఫిబ్రవరి 18: నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) విలువ రూ.4.7 లక్షల కోట్లకు చేరిందని ఓ తాజా నివేదిక పేర్కొన్నది. దేశంలోని అతిపెద్ద ఈక్విటీ మార్కెట్ వేదికల్లో ఒకటైన ఎన్ఎస్ఈ.. త్వరలో ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో)కు రాబోతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో భారతీయ స్టాక్ మార్కెట్లలో నమోదైన, నమోదుకాని 500 భారీ సంస్థలతో బుర్గండి ప్రైవేట్ హురున్ ఇండియా 2024కు గాను ఓ జాబితాను తీసుకొచ్చింది. ఇందులో గత ఏడాది ఎన్ఎస్ఈ విలువ ఏకంగా 201 శాతం పుంజుకున్నట్టు తేలింది. ఇక దేశంలో అత్యంత విలువైన కంపెనీల్లో ఎన్ఎస్ఈ 10వ స్థానంలో ఉన్నది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) ఎన్ఎస్ఈ స్థూల ఆదాయం 28 శాతం పుంజుకొని రూ.16,352 కోట్లుగా నమోదైంది. పన్ను అనంతర లాభం 51 శాతం ఎగిసి రూ.8,306 కోట్లుగా ఉన్నది. కాగా, ఇటీవలే లిస్టింగ్ ప్రక్రియను మొదలుపెట్టిన ఎన్ఎస్ఈ.. మార్కెట్ రెగ్యులేటర్ సెబీకి దరఖాస్తు చేసుకున్నది. పబ్లిక్ ఇష్యూలో 10 శాతం వాటాలను విక్రయించే వీలున్నట్టు అంచనా.

రిలయన్స్ టాప్

రూ.17.5 లక్షల కోట్ల విలువతో ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) హురున్ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నది. రూ.16.1 లక్షల కోట్లతో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) రెండో స్థానంలో ఉండగా, 30 శాతం వృద్ధిని సాధించినట్టు హురున్ పేర్కొన్నది. గ్రూపులవారీగా చూస్తే.. టాటా గ్రూప్ విలువ 37 శాతం వృద్ధితో రూ.32.27 లక్షల కోట్లుగా ఉన్నది. రిలయన్స్ గ్రూప్ రూ.19.71 లక్షల కోట్లుగా ఉంటే.. గౌతమ్ అదానీ గ్రూప్ విలువ రూ.13.40 లక్షల కోట్లుగా తేలింది. ఇక ఈసారి జాబితాలో చోటు దక్కించుకున్న 500 కంపెనీల్లో ప్రతీదాని విలువ బిలియన్ డాలర్లపైనే. ఈ మొత్తం కంపెనీల వాల్యూ కూడా 3.8 ట్రిలియన్ డాలర్లను తాకింది. రెవిన్యూ ట్రిలియన్ డాలర్లుగా ఉంటే.. లాభం రూ.8 లక్షల కోట్లుగా ఉన్నది. పన్నులు రూ.2.2 లక్షల కోట్లుగా ఉండగా.. ఉద్యోగులు 85 లక్షల మంది ఉన్నారు.

క్యూ3 జీడీపీ 6.4%!: ఇక్రా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికం (అక్టోబర్-డిసెంబర్)లో దేశ జీడీపీ వృద్ధి రేటు 6.4 శాతంగా నమోదు కావచ్చని భారతీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేసింది. తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో 6.7 శాతంగా ఉంటే.. రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)లో ఏకంగా ఏడు త్రైమాసికాల కనిష్ఠాన్ని తాకుతూ 5.4 శాతంగానే ఉన్న విషయం తెలిసిందే. ఇందుకు మార్కెట్‌లో డిమాండ్ బలహీనపడటం, కేంద్ర ప్రభుత్వ మూలధన వ్యయం తగ్గిపోవడం కారణంగా పేర్కొన్న ఇక్రా.. ప్రస్తుతం ఈ రెండు అంశాల్లో పరిస్థితులు మెరుగయ్యాయని అంటున్నది. అందుకే వృద్ధిరేటు అంచనా 6.4 శాతంగా నమోదు కావచ్చని చెప్పింది. కాగా, ఈ నెల 28న అక్టోబర్-డిసెంబర్ త్రైమాసిక జీడీపీ వృద్ధి గణాంకాలను ఎన్ఎస్ఓ అధికారికంగా ప్రకటించనున్నది. కాగా, ఆర్బీఐ వృద్ధి అంచనా ఈసారికి 6.6 శాతంగా ఉన్నది.

స్టార్టప్‌లకు బ్రెజిల్ దన్ను

హైదరాబాద్, ఫిబ్రవరి 18(నమస్తే తెలంగాణ): స్టార్టప్‌ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకున్నది. దేశీయ స్టార్టప్‌లకకు అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం కల్పించాలనే ఉద్దేశంతో టీహబ్..బ్రెజిల్‌కు చెందిన గోయాస్ హబ్‌తో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో టీ హబ్ ఫౌండేషన్ సీఈవో సుజిత్, గోయాస్ స్టేట్ సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ సెక్రటరీ జోస్ ప్రెడెరికో లైరా నెట్టో ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంతో తెలంగాణ స్టార్టప్‌లకు బ్రెజిల్‌లో, అలాగే బ్రెజిల్ స్టార్టప్‌లకు ఇక్కడ అవకాశాలు లభించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రధానంగా కృత్రిమ మేధస్సు, ఐటీ, అగ్రి-టెక్, హెల్త్ కేర్, బయోటెక్, మైనింగ్ తదితర రంగాల్లో పరస్పర సహకారం ఉంటుందని వారు వివరించారు.

టెస్లా ఇండియాలో నియామకాలు షురూ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: దేశీయ మార్కెట్లోకి అడుగుపెట్టాలని ఇప్పటికే ప్రయత్నాలు వేగవంతం చేసిన అమెరికాకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా..తాజాగా ఉద్యోగ నియామకాలను ప్రారంభించింది. అతి త్వరలో తన తొలి షోరూంను ప్రారంభించబోతున్న సంస్థ అందుకుతగ్గట్టుగా రిక్రూట్‌మెంట్లను ఆరంభించింది. తన తొలి షోరూంను ముంబైలో ప్రారంభించబోతున్నట్లు తెలుస్తున్నది. నూతన ఉద్యోగాల్లో సర్వీస్ అడ్వయిజర్లు, సర్వీస్ మేనేజర్లు, స్టోర్ మేనేజర్లు ఉన్నారు.

కజారియా నయా సెంటర్

హైదరాబాద్, ఫిబ్రవరి 18: దేశంలో అతిపెద్ద సిరామిక్ అండ్ విట్రిఫైడ్ టైల్ తయారీ సంస్థ కజారియా..హైదరాబాద్‌లో అతిపెద్ద ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించింది. 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్ అన్ని రకాల టైల్స్ లభించనున్నాయని కంపెనీ ఎండీ రిషీ కజారియా తెలిపారు. టైల్స్, బాత్, శానిటరీవేర్ ఉత్పత్తులను ప్రతీ కుటుంబానికి అందించడం లక్ష్యంలో భాగంగా ఈ సెంటర్‌ను నెలకొల్పినట్లు చెప్పారు.

ముగ్గురు రోహింగ్యాలు అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు..అదుపులో నిందితులు

తప్పుడు పాస్‌పోర్టుతోపాటు ఆధార్‌కార్డు, జనన ధ్రువపత్రం

జడ్చర్లటౌన్, ఫిబ్రవరి18 : తప్పుడు ధ్రువపత్రాలను సృష్టించి అక్రమంగా దేశంలో చొరబడి నివసిస్తున్న ముగ్గురు రోహింగ్యాలను అరెస్టు చేసినట్లు మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం సాయంత్రం జడ్చర్ల పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వీరి వివరాలను వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం నర్సింగ్ తండా శివారులోని ఓ ఫాంహౌస్‌లో రోహింగ్యాలు ఉన్నట్లు సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికెళ్లి ముగ్గురు రోహింగ్యాలను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. బర్మా దేశానికి చెందిన నూర్‌అహ్మద్ 2012లో బంగ్లాదేశ్ నుంచి త్రిపుర మీదుగా దేశంలోకి ప్రవేశించాడు. అప్పటి నుంచి 2017 వరకు పలుప్రాంతాల్లో ఐస్‌కంపెనీలో పనిచేశాడు. ఆ తర్వాత తప్పుడు పాస్‌పోర్టును తయారు చేసుకొని 2017లో సౌదీ దేశానికి వెళ్లాడు. తిరిగి 2022లో ఇండియాకు వచ్చి ఇక్కడే బర్మా దేశానికి చెందిన రిజ్వానా అనే యువతిని పెండ్లి చేసుకొని ఇక్కడే స్థిరపడ్డాడు. అదేవిధంగా బర్మా దేశానికి చెందిన అరబ్‌అహ్మద్, సుమాయ అనే ఇద్దరి వద్ద రూ.30 వేలు చొప్పున తీసుకొని ఇండియాకు తీసుకొచ్చాడు. ఆ తర్వాత కొన్నాళ్లపాటు హైదరాబాద్‌లో పనులు చేస్తూ గత ఆరు నెలల కింద మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం నర్సింగ్‌తండా శివారులో అయూబ్‌ఖాన్ అనే వ్యక్తికి చెందిన ఓ ఫాంహౌస్‌లో వ్యవసాయ పనులకు చేరారు. హైదరాబాద్ వాసులుగా చెబుతూ ఫాంహౌస్‌లో వ్యవసాయ పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులకు వచ్చిన విశ్వసనీయ సమాచారంతో పోలీసులు ఫాంహౌస్ వద్దకు వెళ్లి ముగ్గురిని అదుపులోకి తీసుకొని జడ్చర్ల రూరల్ పోలీసుస్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా నూర్‌అహ్మద్ తప్పుడు పాస్‌పోర్టు తయారు చేసుకున్నట్లు గుర్తించారు. అంతేకాకుండా బర్మా దేశానికి చెందిన అతని భార్య రిజ్వానా హైదరాబాద్ వాస్తవ్యురాలిగా జనన ధ్రువపత్రం, ఆధార్‌కార్డును పొందినట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుల నుంచి 2 సెల్‌ఫోన్లు, పాస్‌పోర్ట్, బర్మా దేశానికి చెందిన ఐడీ కార్డులను స్వాధీనం చేసుకొని ముగ్గురిని రిమాండ్ చేస్తున్నట్లు వివరించారు. ఈ కేసులో మరో నిందితురాలు రిజ్వా నా పరారీలో ఉన్నట్లు చెప్పారు. సమావేశంలో జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్, ఎస్సై శివానందంగౌడ్ పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన డ్రైవర్

- నమ్మిబిడ్డకు జన్మనిచ్చిన మైనర్ బాలిక
- పదేండ్లకిందటే పెళ్లి..
- న్యాయంకోసం 9నెలల శిశువుతో షీటీమ్‌ను సంప్రదింపు

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 18 : పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసి ఓ మైనర్ బాలికను తల్లిని చేసిన డ్రైవర్ ఉదంతం నాగర్‌కర్నూల్ మండలంలో చోటు చేసుకున్నది. బిడ్డకు జన్మనిచ్చిన మైనర్ బాలికకు తానున మ్మిన డ్రైవర్‌కు పదేండ్ల కిందటే పెళ్లయ్యిందని తెలిసింది. దీంతో పెళ్లి చేసుకోకపోగా, తనను తన బిడ్డను పట్టించుకోకపోవడంతో 9నెలల శిశువుతో నాగర్‌కర్నూల్‌లోని షీటీమ్‌ను ఆశ్రయించింది మైనర్ బాలిక. ఇందుకు సంబంధించిన షీటీమ్ ఇన్‌చార్జి విజయలక్ష్మి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలిక పదోతరగతి వరకు చదివింది. బస్సులో రాకపోకలు సాగిస్తూ మహబూబ్‌గర్‌లో ఇంటర్మీడియట్ చదువుతుంది. ఈ క్రమంలో భూత్పూర్ మండలం కొత్తమొల్గర గ్రామానికి చెందిన బస్సుడ్రైవర్ ఎండీ జాఫర్‌తో సదరు మైనర్ బాలికకు పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్త ప్రేమగా మారింది. బాలికను పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో పూర్తిగా నమ్మింది. దీంతో సదరు డ్రైవర్ డ్యూటీలో లేనప్పుడు కూడా బిజినేపల్లికి వచ్చి ఆబాలికను తీసుకెళ్లి ఇద్దరూ కలిసి తిరుగుతూ శారీరకంగా ఒక్కటయ్యారు. కొంతకాలం తర్వాత గర్భిణి అని తెలియంతో బాలిక పెళ్లి చేసుకోవాలంటూ పట్టుబట్టింది. అప్పుడూ ఇప్పుడూ అంటూ కాలం వెళ్లదీశాడు.

ఈ క్రమంలో బాలికపై తల్లిదండ్రులకు అనుమానం వచ్చి నిలదీశారు. విషయం తల్లిదండ్రులకు చెప్పింది. డ్రైవర్ గురించి ఆరాతీయగా పదేండ్ల క్రితం పెళ్లయ్యిందని తెలిసింది. దీంతో పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టడంతో పెళ్లి చేసుకుంటానని తల్లిదండ్రులను నమ్మించాడు. ఈ క్రమం లో బాలికకు నెలలు నిండడంతో బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం కొంతకాలం మహబూబ్‌నగర్‌లో రూమ్ పెట్టి తల్లీ బిడ్డలను చూసుకున్న సదరు డ్రైవర్ ఈ మధ్యకాలంలో వారి వంక చూడకపోవడంతో బతకడం ఇబ్బందిగా మారింది.

విధిలేని పరిస్థితితో బాలిక తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. ఈ తతంగమంతా బయటపడడంతో సదరు బాలిక నాగర్‌కర్నూల్‌లోని షీటీమ్‌ను ఆశ్రయించింది.

కాగా డ్రైవర్ పరారీలో ఉండగా అతనిపై పోక్సో, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు షీటీమ్ ఇన్‌చార్జి విజయలక్ష్మి తెలిపారు.

ముగిసిన సామాజిక తనిఖీ

భూత్పూర్, ఫిబ్రవరి 18: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రెండు రోజులుగా జరిగిన 15వ సామాజిక తనిఖీ మంగళవారం ముగిసినట్లు ఎంపీడీవో ప్రభాకరాచారి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023-24సంవత్సరానికిగానూ ఉపాధి పనులకు సంబంధించి మండల వ్యాప్తంగా రూ.3.43కోట్లు వ్యయమైనట్లు తెలిపారు. ఈ తనిఖీలో రూ.63,600 రికవరీ చేసినట్లు తెలిపారు. ఇందులో రూ.34.500జరిమానా కింద వసూలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు డీఆర్డీవో ముసాయిదాబేగం, ఏపీడీ మంజుల, ఏపీవో విమల తదితరులు పాల్గొన్నారు.

మాలలను అణచివేస్తున్న ప్రభుత్వాలు

ఊట్కూర్,ఫిబ్రవరి 18: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాలలను అణచివేస్తున్నాయని జాతీయ మాలల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గ్యాంగ్ హన్మంతు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో నిర్వహించిన మాలల హక్కుల పరిరక్షణ సమితి కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలో జరుగుతున్న వర్గీకరణ విషయంలో మాలలకు తీరని అన్యాయం జరుతుందన్నారు. 2011 సెన్సెస్ ప్రకారం కాకుండా ప్రస్తుతం మాలల జనాభాను లెక్కించాలని డిమాండ్ చేశారు. కమిటీ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాలల హక్కుల సమితి జిల్లా అధ్యక్షుడు హన్మంతు, రాములు, కృష్ణయ్య, భానుచందర్, శారద, పద్మమ్మ, హన్మమ్మ, అనంతమ్మ పాల్గొన్నారు.

ఇసుక ఉచితంగా సరఫరా చేయాలి

మహబూబ్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 18: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో భవన నిర్మాణ కార్మికులు, సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ విజయేందిర బోయిను కలిసి ఇసుక ఉచితంగా సరఫరా చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలోని బడుగు, బలహీన వర్గాలు, ఇందిరమ్మ ఇండ్లు, డీసీఎల్ ఆఫీస్, పెండింగ్‌లో ఉన్న భవన నిర్మాణ కార్మిక భవనాలకు ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని వినతిపత్రంలో వివరించినట్లు తెలిపారు. అలాగే డీసీఎల్ లేబర్ కమిషన్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న కార్మిక సంఘాల రిజిస్ట్రేషన్లను వెంటనే ప్రారంభించాలని, భవన నిర్మాణ కార్మికులకు బీమా కార్డులు, క్లెయిమ్, కొత్త కార్డుల నమోదు వంటివి ఆన్‌లైన్‌లో నమోదు కావడంలేదని వాటిని త్వరగా పరిష్కరించాలని కోరామన్నారు. కలెక్టర్‌ను కలిసి వారిలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వరద గాలన్న, కృష్ణయ్య, సీఐటీయూ నాయకులు కురుమూర్తి, వేణుగోపాల్, తిరుమలయ్య ఉన్నారు.

బాలబాలికలు చదువుపై దృష్టిపెట్టాలి

గండీడ్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సురక్ష పోలీసు కళాజాత బృందం

గండీడ్, ఫిబ్రవరి 18: బాలబాలికలు చదువుపై దృష్టి పెట్టాలని సురక్ష పోలీసు కళాబృందం, మానవ అక్రమ నిరోధక విభాగం వారు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో సురక్ష పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు సామాజిక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు కళాజాత ఆటపాటతో అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బాలబాలికలు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సైబర్ నేరగాళ్లు చూపే మోసపూరిత ఆశలు, గిఫ్టులు, వచ్చాయని లక్కీడ్రాలో గెలుపొందారని, ఆన్‌లైన్‌లో తక్కువ ధరకే వాహనాలు వస్తువులు దొరుకుతాయని మోసం చేయడం జరుగతుందన్నారు. అపరిచిత వ్యక్తులు మీ పేరుమీద యాప్‌లలో లోన్ వచ్చిందని క్యూఆర్ కోడ్ పంపించి దానిని స్కాన్ చేస్తే డబ్బులు వస్తాయని చెప్పితే మోసపోవద్దన్నారు. సైబర్ నేరాలకు గురైన, మోసాలకు బలైన వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో సామాన్యులకు అన్యాయం

ఊట్కూర్, ఫిబ్రవరి 18: కేంద్ర ప్రభుత్వం పేదలు, మధ్య తరగతి ప్రజలను విస్మరించి విదేశీ, స్వదేశీ కార్పొరేటర్లు, పెట్టుబడిదారులకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కృష్ణ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బిజ్వారం శ్రామిక భవనంలో నిర్వహించిన ప్రజాపంథ పార్టీ డివిజన్ స్థాయి జనరల్‌బాడీ సమావేశానికి ముఖ్య వక్తగా హాజరై మాట్లాడారు. ఇటీవల కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో చిన్న, న్నకారు రైతులు, కార్మికులకు ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేదన్నారు. స్కీమ్ వర్కర్లు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ, ఉపాధి కూలీల శ్రమ దోపిడీకి పాల్పడుతుందని ఆరోపించారు. హక్కుల కోసం అన్ని వర్గాల ప్రజలు సంఘటితమై పోరాటాలకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. ఈనెల 28న ఢిల్లీలో నిర్వహించే జాతీయ సదస్సుకు అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాపంథ డివిజన్ కార్యదర్శి సలీమ్, జిల్లా కార్యదర్శి రాము, కాళేశ్వర్, గోవర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, భగవంతు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కృష్ణ

కొనసాగుతున్న పదోఅంతర్గత మార్కుల పరిశీలన

జాజాపూర్ పాఠశాలలో మార్కులను పరిశీలిస్తున్న బృందం

నారాయణపేట రూరల్, ఫిబ్రవరి 18 : మార్చి నెల 22 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు వివిధ సబ్జెక్టులలో అంతర్గత మార్కులు వేయనున్నారు. పరిశీలన కోసం జిల్లా వ్యాప్తంగా 31 ప్రత్యేక అధికారుల బృందాలను ఏర్పాటు చేశారు. జాజాపూర్ ఉ